## 105. ధన్యులు

కాషాయ వస్త్రాల్లోని ఓ మఠాధికారి ఇంగ్లండ్‌లో హిందూ మతం మీద స్పీచ్‌లు ఇచ్చి భారతదేశానికి సముద్రం మీద ప్రయాణిస్తూ తిరిగి వస్తూండగా దారిలో ఓ ద్వీపం కనపడింది.

“అక్కడ ఎవరుంటారు?” ఆ మఠాధికారి ఓడ కెప్టెన్‌ని అడిగాడు.

“ఏమో మరి? నేను విన్న కథనం ప్రకారం అక్కడికి చేపలు పట్టేవారు వెళ్ళినప్పుడు ముగ్గురు మనుషులని వారు ఆ ద్వీపంలో చూసారు. వాళ్ళు సాక్షాత్తు దైవ స్వరూపులని ఆ చేపలు పట్టేవాళ్ళ నమ్మకం.”

“దైవ స్వరూపులా? ఒక్క గుడి అయినా లేని ఇలాంటి అనాగరిక ద్వీపంలో అలాంటివారు ఉండటం అసాధ్యం. నేను ఓ సారి వాళ్ళ దగ్గరకి వెళ్ళి చూసి వాళ్ళకి దైవ ప్రార్ధనని బోధిస్తాను.” చెప్పాడు మఠాధికారి.

ఆ ద్వీపం సమీపంలో కెప్టెన్ లంగరు వేసాడు. ఓ చిన్న పడవని నీళ్ళల్లోకి దింపారు. మఠాధికారి దాన్ని ఎక్కి తెడ్లు వేసే నలుగురు మనుషులతో ఆ ద్వీపానికి చేరుకున్నాడు. ఆయన ద్వీపంలోని ఆ ముగ్గురు మనుషులని వెదుకుతూ ముందుకు సాగాడు.

ఓ కొండ గుహ దగ్గర ధృఢంగా పొడుగ్గా ఉన్న ఒకతను, పొట్టిగా బక్కపల్చగా ఉన్న రెండో అతను, ఆయనకి కనిపించారు. వాళ్ళందరి మొహాల్లో తేజస్సు ఉట్టిపడుతూండటం మఠాధికారి గమనించాడు.

“మీలాంటి వారు ఇక్కడ ఇంకా ఎంత మంది ఉన్నారు?” ప్రశ్నించాడు మఠాధికారి.

“మేము, మా గురువు గారు.” జవాబు చెప్పారు వారు.

“అలాగా? మీగురువు గారు ఎక్కడ ఉంటారు?” ప్రశ్నించాడు మఠాధికారి.

“గుహలో ఉంటారు.”

“ఓసారి ఆయన్ని ఇక్కడికి పిలుచుకు రాగలరా? ఆయనతో మాట్లాడాలి.”

సాధారణంగా ఉన్న మరొకతను బయటకి వచ్చాడు. కేవలం కౌపీనంలో ఉన్న అతని మొహం మరింత తేజస్సుతో ఉంది.

"మీరు ఎక్కడి వారు?" ప్రశ్నించాడు మఠాధికారి.

"ఇక్కడే పుట్టి పెరిగాం." జవాబిచ్చాడు గురువు.

"అలాగా? మీకు విష్ణుమూర్తి గురించి తెలుసా?" అడిగాడు మఠాధికారి.

"తెలీదు." జవాబు చెప్పాడు గురువు.

"వైష్ణవాలయం లేదా ఇక్కడ?"

"అంటే?" అడిగాడు గురువు.

"విష్ణువు గురించి తెలీని మీరు ఇక్కడ ఉండి ఏం చేస్తూంటారు?"

"దైవాన్ని ప్రార్థిస్తూంటాం."

"ఏమని?"

గురువు తన శిష్యుల వంక చూసాడు. వెంటనే వాళ్ళు చేతులు పైకెత్తి ఆకాశంలోకి చూస్తూ ప్రార్థించారు.

"మీరూ ముగ్గురే. మేమూ ముగ్గురమే. మా మీద దయ చూపించండి."

"మీరు ప్రార్థించేది త్రిమూర్తులని అని అర్థమవుతోంది. కాని మీ ప్రార్థన సరైన దేవుణ్ణి ఉద్దేశించి లేదు. సరైన పదాలతో కూడా లేదు. అష్టాక్షరీ మంత్రాన్ని మీకు మేము ఉపదేశిస్తాము. దాంతో మీరు తరిస్తారు."

"అలాగే." కృతజ్ఞతగా చూస్తూ చెప్పాడు గురువు.

వాళ్ళని స్నానం చేసి మడి కట్టుకుని రమ్మని, తూర్పు ముఖంగా కూర్చోపెట్టి వాళ్ళకి శంఖు చక్రాల గురించి, విష్ణుమూర్తి గురించి వివరించి, అష్టాక్షరీ మంత్రాన్ని ఉపదేశించాడు ఆ మఠాధికారి. వాళ్ళు వత్తులని సరిగ్గా పలకలేక పోతే వాళ్ళకి ఆ మంత్రం నోటికి వచ్చేదాకా ఓపికగా వల్లె వేయించాడు మఠాధికారి. తర్వాత వారితో చెప్పాడు.

"ఇక మీరు నిత్యం పవిత్రమైన ఈ మంత్రాన్ని వల్లె వేసుకుంటూండండి. కొద్ది రోజుల్లో మీకు దైవానుగ్రహం లభిస్తుంది."

వాళ్ళు ముగ్గురూ మరోసారి మఠాధికారికి తమ కృతజ్ఞతలని ఒంగి, ఒంగి తెలియచేసుకున్నారు. తిరిగి మఠాధికారి పడవ మీద తమ ఓడని చేరుకున్నాడు. జరిగింది దర్పంగా కెప్టెన్‌కి వివరించాడు. ఓడ తిరిగి బయలు దేరింది. కొద్ది మైళ్ళు ఓడ ప్రయాణించే దాకా మఠాధికారి ఆ ద్వీపం వంక చూస్తూండిపోయాడు. 'సాక్షాత్తు ఆ నారాయణుడే తనని వాళ్ళ దగ్గరకి మంత్రోపదేశానికి పంపించి ఉంటాడు. లేకపోతే వాళ్ళ జన్మలు వృధా అయేవి' అనుకున్నాడు ఆయన.

అకస్మాత్తుగా ఆ మఠాధికారికి దూరంగా సముద్రం మీద ద్వీపం వైపు నించి ఏదో కదులుతూ కనపడింది. ఆయన అది ఏమిటా అని దీక్షగా చూడసాగాడు. చూస్తూండగానే ద్వీపంలోని ముగ్గురిలోని పొట్టి శిష్యుడు నీళ్ళ మీద పరుగెత్తుకుంటూ ఓడ వైపు రావడం కనిపించింది. మఠాధికారికి మతి పోయినట్లయింది. ఆ శిష్యుడు ఓడ దగ్గరకి చేరుకోగానే గాల్లో, కనపడని మెట్లమీద నడిచినట్లుగా డెక్ మీదకి చకచక నడిచి వచ్చి మఠాధికారికి నమస్కరించి చెప్పాడు.

"మమ్మల్ని క్షమించమని మా గురువు గారు చెప్పి పంపారు. మందమతులం కాబట్టి మంత్రం మర్చిపోయాం. ఓ సారి దాన్ని గుర్తుచేస్తారా?"

మఠాధికారిలోని దర్పం అణగడంతో లేచి అతనికి నమస్కరించి చెప్పాడు.

"మీకు ఏ మంత్రం అవసరం లేకుండానే దైవానుగ్రహం లభించింది. మీరు ధన్యులు."

## 106. నిజాయితీ

ఆ రోజు శనివారం. అమలాపురంలో సర్కస్ కేంప్ వేసింది. వెంకటేశ్వర రావు తన ఇద్దరు పిల్లలని ఆ సర్కస్‌కి సాయంత్రం అయిదున్నరకి తీసుకువచ్చాడు. ఆరుకి షో మొదలవుతుంది. టికెట్ కౌంటర్ ముందు క్యూలో నిలబడ్డాడు. పిల్లలిద్దరూ కళ్ళింత చేసుకుని సర్కస్ పోస్టర్లని చూస్తున్నారు. తన వంతు రాగానే వెంకటేశ్వర రావు అడిగాడు.

"పిల్లలిద్దరికీ కూడా టిక్కెట్లు తీసుకోవాలా?"